అత్తగారికి జీవితాంతం కృతజ్ఞతగా వుండటం అల్లుడి కనీస బాధ్యత. దాన్ని విస్మరించడం అవమానించినట్లే. అల్లుడు ఏభై డాలర్లు నష్ట పరిహారంగా తన అత్తగారికి చెల్లించి తీరాలి.

ఫ్లోరిడా కోర్ట్ అపీల్స్ :

అత్తగారు చేసిన వంటకాన్ని ఓ కోడలు నచ్చకపోవడంతో తన పెంపుడు కుక్కకి పెట్టడం తప్పా?

—కాదు. ఆ కోడలికి వంటవచ్చు కాబట్టి వంటకంలోని తప్పొప్పులు నిర్ణయించగల జ్ఞాని. పైగా, తను ప్రేమించే పెంపుడుకుక్కకి పెట్టడం అవమానించడం కాదు. ఆ కుక్కమీది ప్రేమతో పెట్టివుండచ్చుగా? ఊరకుక్కకి పెడితే ఆలోచించాలి.

# ఆల్ అబౌట్ రిపార్టి

మిమ్మల్ని ఎవరయినా ఏదయినా మాటంటే, తిరిగి అలా అన్న వాళ్ళని అదే విధంగా అని అవమానించగలగడం కేవలం పుట్టుకతో దేముడిచ్చిన వరంలా వస్తుంది. ఓ అరగంట, తర్వాత ఒకోసారి ఓ రోజు తర్వాత తట్టొచ్చు తిరిగి ఏం అని వుండాలో. బట్ టూ లేట్. ఇంగ్లీష్‌లో 'రిపార్టి' అనే పదంతో పిలవబడే ఈ ప్రక్రియలో చాలామంది సిద్ధ హస్తులు ప్రముఖులే. వాటిలో కొన్ని.

చర్చిల్‌తో ఓ అమ్మాయి 'మీసాలెందుకు? అసహ్యంగా వున్నాయవి మీకు' అంటే, అవి గుచ్చుకునే ప్రమాదం మీకు లేదుగా' అని తిప్పి కొట్టాడు.

జార్జి బెర్నార్డ్ షాని ఓ నటి 'మనిద్దరం వివాహం చేసుకుంటే పిల్లలకి నా అందం, మీ తెలివి వస్తాయి' అంటే అందవికారంగా వుండే షా 'కాని నా అందం, నీ తెలివివస్తే ప్రమాదం కదా?' అన్నాడు.

ఓసారి ఓ సినీనటి అల్ ఫ్రెడ్ హిచ్‌కాక్‌తో పోట్లాటలో 'మీరు నా భర్తయివుంటే కాఫీలో ఇంత విషం కలిపి ఇచ్చేదాన్ని' అని అరిస్తే 'నీ భర్తనే అయితే ఆనందంగా తాగేవాణ్ణి, అని ఆయనకామ్‌గా జవాబిచ్చాడు. అందరికీ ఇంతటి రిపార్టీ వుండదుగా. ఇలాంటి 'రెడీమేడ్ రిపార్టీలు' కొన్ని ఈ కాలం ద్వారా అందిస్తున్నాను. అవసరమయినవారు అవసర మయిన చోట వాటిని వాడుకోవచ్చు. నో కాపీరైట్. ముఖ్యంగా బాస్‌ల దగ్గర, భార్యా భర్తల దగ్గర నిత్యం వీటి అవసరం ఏర్పడుతూంటుంది.

'బార్బర్స్ అతని జుట్టుని కట్ చేయడానికి డబ్బు వసూలు చేయరు. జుట్టుని వెదకడం కోసం డబ్బు వసూలు చేస్తారు.'

'ఆ అమ్మాయి యిప్పుడు సన్నగా వుండేదేమో కాని పెళ్ళినాడు బుట్టలో కూర్చున్నప్పుడు అరుగురు మేనమామలు, ఇద్దరు పెద్దనాన్నలు, ఒక అన్నయ కలిసి మోసుకెళ్ళారు, గౌరీ దేవి వ్రతం పీటల మీద నించి.'

'ఆయన ఎంత తాగుబోతంటే, ఓసారి వేలుకి సిగరెట్ అంటుకున్నప్పుడు ఆ వేలు నాలుగు రోజులు కాలింది.'

'ఆ అమ్మాయి కాలేజి బ్యూటీగా పద్దెనిమిదో ఏట ఎన్నికయింది. అప్పట్లో వాళ్ళ కాలేజ్‌లో అమ్మాయిలు తక్కువగా వుండేవారు.'

'ఆ అమ్మాయి నోరు ఎంత పెద్దదంటే, అరటి పండుని అడ్డంగా ఒకేసారి నోట్లో పెట్టుకుని తింటుంది.'

'పక్కవారిని ప్రేమించు అన్ని చిన్నప్పుడు స్కూల్లో నేర్చుకున్న నీతి వాక్యం ఇప్పటికీ పాటిస్తాడాయన. ఆయన పక్కింటి అమ్మాయి వయస్సు 17.'

'ఆయన జీవిత చరిత్రని (లేదా స్నేహితుల పేర్లని) ఓ బస్ టిక్కెట్ వెనక రాయచ్చు.'

'ఆ నటుడంటే ప్రేక్షకులకి ఎంత మర్యాద! ఆయన సినిమా చూస్తూ ఆవలించేటప్పుడు నోటికి చేతిని అడ్డు పెట్టుకుంటారు.'

'ఆయన తెలుగులో మొట్టమొదటి టి.వి. అనౌన్సర్. టి.వి.ని ఆఫ్

చేయడం ఆయన కనపడటంతోనే మొదలయింది.'

'ప్రేక్షకులకి ఇవాళ ఈ సాంస్కృతిక సభలో రెండు ఆశా భంగాలు. ఒకటి అక్కినేని నాగేశ్వరరావు ముందు ప్రకటించినట్లుగా రావడం లేదు. రెండు శ్రీ సుబ్బారావు ఆయన బదులుగా వస్తున్నారు.'

'ఫలానా సినిమా మూడు వారాల తర్వాత వెళ్ళిపోవడానికి కారణం బేడ్ లాంగ్వేజ్.... విమర్శకులు ఉపయోగించిన బేడ్ లాంగ్వేజ్'.

'కథని బట్టి ఈ చిత్రానికి ఎంటర్‌టెయిన్‌మెంట్ టేక్స్ ప్రభుత్వం రద్దు చేసింది.'

'మీ కుటుంబంలో యింతదాకా ఆత్మహత్య అనేదే లేకపోతే మీరా రొటీన్ ఎందుకు బద్దలు కొట్టకూడదు?'

'జీవించడానికి నాకింత ఆశనిచ్చారు మా ఆయన. ఆ ఆశ విడాకులు'

'అతను ఎలాంటి మిత్రుడంటే, నాకు ఏదైనా అంటు వ్యాధి వచ్చినప్పుడు మా ఇంటికి పిలవాలనిపించేవాడు'.

'మీ అబ్బాయి సహజంగా వెధవా? లేక బ్రెయిన్‌ని ఎవరికయినా డొనేట్ చేసేసాడా?'

'అతన్ని కిడ్‌నేప్ చేసినా ప్రయోజనం లేని మనిషంటే, వదలడానికి డబ్బు ఇవ్వమని ఎవరిని కాంటాక్ట్ చేయాలి?'

'అనేక మంది ఆ డాక్టర్‌కి ఎంతో బాకీ పడ్డారు.... డోకులు, అల్సర్స్, విరోచనాలు మొదలయిన వాటికి'.

'అతన్ని చూస్తే మునివల్లె గుర్తొస్తుంది. ఆంధ్ర రాష్ట్రంలోని డల్లెస్ట్ వూరది.'

'నా గురించి నీకు అబద్ధాలు చెప్పడం మానేస్తే నీ గురించిన నిజాలు చెప్పడం నేను మానేస్తాను'

'నా నోటినించి ఎన్నడూ వినలేని మాట విడాకులు. నాకదంటే అసహ్యం. హత్య? అది ఓ.కె.'

'మా ఆవిడ తక్కువ ధరల్లో దొరికేవే కొంటుంది. మొన్న రెండు

చీరలు, ఓ లిఫ్ట్ కొనుక్కొచ్చింది'

'బాణం ఎందుకు కొన్నానంటావా? పిస్తోలుతో కాలిస్తే పిల్లలు లేవరూ?'

'తెగ మొహమాటపడుతూంటే, మా ఇల్లు నీ ఇల్లే అనుకో అని మా బావమరిదితో చెప్పాను. నిన్న ఇల్లమ్మేసాడు'

'మా ఆవిడ మొటిమలు పోవడానికి ప్రకృతి వైద్యుడు చెప్పినట్లుగా మొహానికి బంకమట్టి రాసుకుంది. ఆ రెండు రోజులూ ఎంతో అందంగా కనబడింది ఆమె మొహం.'

'ప్చ్ నాకు మొదట్నించి కళ్ళ జోడుంటే మిమ్మల్ని పెళ్ళి చేసుకుని వుండే దాన్నే కాదండి'

'మా బాస్‌తో నేను మూడు వారాలుగా మాట్లాడడం లేదు. ఆయనకి తను మాట్లాడుతున్నడు మధ్యలో అడ్డుపడుతూ మాట్లాడడం నచ్చదంటే నచ్చదు'

'మా ఆవిడకి రాత్రి అద్భుతమయిన భోజనం ఎలా తినాలో తెలుసు. ఆటో ఎక్కి డాల్ఫిన్స్ హోటల్‌కి వెళ్ళి'

'మా ఆవిడ, నేను విడాకుల గురించి లాయర్ దగ్గరికి వెళ్ళాం కానీ లాయర్ ఫీజ్ తెలిసాక దాంతో సెకండ్ హేండ్ కారు కొనుకున్నాం.'

'మా ఆయన ఫిల్మ్ ఇండస్ట్రీలో పనిచేస్తారు. మద్రాస్ టి.నగర్ లోని నిర్మాత లందరికి ఆయన పనిచేసే బేంక్‌లోనే ఆకౌంట్స్ వున్నాయి'

'మావాడు స్టేజ్ మీదే కాక బయట కూడా గొప్ప మెజీషియనే. నిన్న రాత్రి పార్టీ ఇచ్చినాయన భార్యతో గంటసేపు మాయం అయ్యాడు'

'ఏమిటి? అతిగా పొగుడ్తున్నానని తిడుతున్నారా? ఆహా.... మీరు ఎంత అందంగా తిట్టగలరండి'

'పుట్టగానే మా ఆయన అనుకుని మా అత్తగారు పొరబాట్న ఇంకొకరి పిల్లాడిని తెచ్చింది కాని, లేకపోతే మావారు ఇంకా తెలివిగల వాళ్ళై వుండేవారు.'

'వాళ్ళ పొట్లాట ఎందుకు సద్దు మణిగిందంటే, తన బాయ్ ఫ్రెండ్‌తో ప్రతి బుధ, ఆదివారాలు గడపడానికి ఆయన వప్పుకోబట్టి'

'సిగరెట్ పేకెట్ ఎందుకు అఫర్ చేస్తున్నానా? మా పెదనాన్నకి సిగరెట్స్ తాగబట్టి కేన్సర్ వచ్చిందని ఇందాకే లెటర్ వచ్చింది'

'బాగానే నవ్వించేవాడే, కొత్త జోకులు చెప్పివుంటే'

'ఆవిడగారు ఎంత ముసలిదంటే, టూత్ పేస్ట్ కనిపెట్టక మునుపు రోజులు గుర్తున్నాయట'

'నాతో కూడా ఆవిడ మాటలు కట్ చేయడంతో పాపం స్నేహితు లంటూ లేకుండా పోయారు'

'మీరుండేది గ్రౌండ్ ఫ్లోరా అని ఎందుకడిగానంటే, ఫస్ట్ ఫ్లోరయినా కనీసం కొంత సన్నగా వుండేవారని'

'కొత్త మారుతికారు కావాలనుకున్న రోజే మా పక్కింటబ్బాయి లాయర్ అవుదామనుకుని బి.ఎల్.లో చేరారు. మీరు ఏం కావాలనుకుని లాయరు అయ్యారు?'

'డయటింగ్‌కి మిమ్మల్ని రోజుకో కొబ్బరికాయ తినమంటే నా వుద్దేశం, చెట్టెక్కి స్వయంగా కోసుకుని తినమని'

'ఒకప్పుడు మిమ్మల్ని చూస్తే సువేగా గుర్తొచ్చేది. ఇప్పుడో? డబుల్ డెక్కర్ బస్ గుర్తొస్తోంది'

'మీ పేరు విన్నాను.... పేరున్న వాళ్ళని తిడుతూ లెటర్స్ రాస్తూండడం కూడా పాపులారిటీకి మంచి టెక్నిక్కేనండోయ్'

'ఈ మధ్య మీరు కొత్త నవలేం రాయడం లేదు. ఇంగ్లీష్ నవలల ఇంపోర్ట్ మీద మీద బేన్ పెట్టారా?'

'ఇప్పుడు మీరు ఎవరితో వుంటున్నారు?'

'అబ్బే మీ జోక్‌కి నవ్వలేదు. నాకు అస్తమా'

'మీ పిల్లలిద్దరు లేచిపోతే లేచిపోయారు కానీండి, మన కాలనీలో మీ పేరు మారుమ్రోగి పోతోందంటే నమ్మండి'

'మీరు ఏ పని చేపట్టినా దాని అంతు చూసే దాకా వదల రంటున్నారు. ఓ గొయ్యి తవ్వరాదూ?'

'మీరు నల్లగా వున్నారని అనను. వెధవలు ఆ మాటనేది; కానీండి, మిమ్మల్ని చూస్తే ఎందుకో గొడుగు గుర్తొస్తూంటుందండి'

'మీరు మా ఇంటికి రావడం ఎంతో సంతోషంగా వుంది. ఇంకో సారి రాబోయే ముందు దయచేసి ఫోన్ చేయరూ?'

'ఓహో.... ఇడ్డెను అన్న పదంలో బూతుందని ఆంధ్రభూమి డెయిలీలో 'జనవాణి'కి రాసింది మీరేనన్నమాట. మరి మీకు 'గారె' ఎలా వుంటుందో తెలీదా?'

మిగతావి మీ ఓపిక.

# భారత దేశ జనాభా ఎంత?

ఎన్నికల సందర్భంగా, కృష్ణశబ్దం శీర్షిక ఆంధ్రభూమి డెయిలీలో కొంతకాలం మాయం అయినపుడు (ఎన్నికల వార్తలు భూమి డెయిలీలోని అనేక రెగ్యులర్ శీర్షికలని మింగేసాయి) మనదేశంలో తాజా జనాభాలెక్కల సేకరణ జరిగింది.

ఆ సందర్భంలో నేనో ఘోరమైన పొరపాటు చేశాను. దాన్ని సరిదిద్దుకున్నాను. ఆ తాజా జనాభాలెక్కల ప్రకారం భారత జనాభా మొత్తం 84 కోట్ల 39 లక్షల 30 వేల 861 మందిగా పేపర్లో ప్రకటించారు నిజానికి ఆ జనాభా సంఖ్యలో 'ఒకటి' నా పొరబాటువల్ల పెరిగివుండేది. అంటే నిజానికి జనసంఖ్య 84,39,30,361 అయినా 84,39,30,862 మంది అయివుండేది. అలాగే వారిలో స్త్రీల సంఖ్య 40,63,32.932గా ప్రభుత్వం ప్రకటించింది. ఈ సంఖ్య 40,63,32,933 అయి వుండేది, నేను ఆ పొరబాటుని సమయానికి సరిదిద్ది వుండకపోతే. అంటే ఓ స్త్రీని ఎక్కువగా ప్రభుత్వం పొరబాటును లెక్కించి వుండేది.